క్లుప్తంగా

నేటి నుంచి అశిరాంబిక అమ్మవారి జాతర


శ్రీఅశిరాంబిక అమ్మవారు

కపిలేశ్వరపురం: అంగర గ్రామ దేవత అశిరాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ నిర్వాహక కమిటీ నాయకులు రాగం రామచంద్రరావు తెలిపారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా కొలిచే అమ్మవారి జాతర ఆదివారం రాత్రి జరుగుతుందన్నారు. సోమవారం ఆలయం వద్ద తీర్థం, మంగళవారం నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


డెంగీ జ్వరాలపై ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్న ఆసుపత్రి వైద్యులు

రామచంద్రపురం: డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి యూహెచ్‌సీ డాక్టర్ సుధీర్ అన్నారు. డెంగీ వారోత్సవాల్లో భాగంగా ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శనివారం పట్టణంలో ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించి డెంగీ జ్వరాలు సోకే విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ దోమల ఉధృతి కారణంగా డెంగీ విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. పట్టణంలో ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్‌వైజర్ భగవాన్, ఎస్‌యూఓ వెంకటసత్యనారాయణ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్తమూరులో 161 మందికి హోమియో వైద్యం


రోగులకు మందులు అందిస్తున్న సత్యనారాయణరెడ్డి

మండపేట: పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి నెలా ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఏర్పాటు చేస్తున్న ఉచిత హోమియో వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రముఖుడు ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి అన్నారు. అర్తమూరులోని ట్రస్టు కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన 161వ వైద్య శిబిరాన్ని సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. రాజమహేంద్రవరంలోని డాక్టర్ అల్లు రామలింగయ్య హోమియో వైద్య కళాశాలకు చెందిన వైద్యులు 290 మంది రోగులకు వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ట్రస్టు సభ్యులు సత్తి సత్యనారాయణరెడ్డి, తాడి కోదండరామారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, ఓగిరెడ్డి రామారెడ్డి, కేబీఎస్ఎన్ రాజు, జీవీవీఎస్ఎన్ మూర్తి, తాడి సుబ్బిరెడ్డి, మండ నాగిరెడ్డి, తేతలి ఆదిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కె.గంగవరం: మండలంలోని దంగేరులో పశువులకు సంక్రమించే గొంతువాపు (దొమ్మ) నివారణ టీకాలు రెండో రోజు శనివారం కూడా కొనసాగింది. ఈ శిబిరాన్ని సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పాడి రైతులందరూ తప్పనిసరిగా గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాడి రైతులకు ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. పశువైద్యాధికారి కేవీ రామరాజు, పశ సంవర్ధక శాఖ సహాయకులు శ్రీనివాసు, కల్యాణి, గోపాలమిత్రలు సురేష్, నారాయణ, పాడి రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విష జ్వరాల కట్టడికి డెంగీ మంత్

మండపేట: వర్షాకాలం మొదలైనందున సీజనల్‌గా వచ్చే డెంగీ, మలేరియా తదితర విష జ్వరాలను కట్టడి చేసేందుకు డెంగీ మంత్ నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి. రామ్ కుమార్ తెలిపారు. దోమల నిర్మూలన, విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన స్టిక్కర్లను పట్టణంలోని ప్రతి ఇంటికీ అతికించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. కార్యక్రమం విజయవంతానికి పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ రామ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు.

పేదలకు వరం జగనన్న సురక్ష


తాళ్లపొలంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న నరేన్, తహసీల్దార్ తదితరులు


కుయ్యేరులో లబ్ధిదారులకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

రామచంద్రపురం రూరల్: తమకు అవసరమైన 11 రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా, సకాలంలో అందించే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించి అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం పేదలకు వరమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్ అన్నారు. మండలంలోని తాళ్లపొలంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నరేన్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు మంజూరైన ధ్రువపత్రాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టా గోవిందు, ఉప సర్పంచ్ వల్లు శివ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సుందర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఓదూరులో ఎంపీడీఓ ఎన్.షెలత్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్పంచ్ కొండేపూడి ప్రసన్న, ఆర్‌ఐ మునీశ్వర్, పంచాయతీ కార్యదర్శి కేవీ శ్రీనివాస్‌ల చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేశారు.

అర్హుల కోసమే సురక్ష

కాజులూరు: సీఎం జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాల అందుతున్నాయని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. శనివారం కుయ్యేరు గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్షలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, మండల తహసీల్దార్ సాయిసత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తన పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరాలన్నదే సీఎం జగనన్న ఆశయమని దానికనుగుణంగా కుల, మత, పార్టీల భేదం లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చీకట్ల సత్యనారాయణ, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, పార్టీ మండల ఎస్సీ సెల్ కార్యదర్శి మేకల శ్రీనివాస్, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధి

కపిలేశ్వరపురం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కుల,మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం తరఫున లబ్ధి చేకూర్చేందుకు సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు విశేష కృషి చేస్తున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కోరుమిల్లి-1 సచివాలయం పరిధిలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు పాల్గొన్న గ్రామ సభలో 2,046 మందికి చెందిన సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరావు, సచివాలయ కన్వీనర్లు సలాది వీరబాబు, పేరాబత్తుల రామకృష్ణ, పిల్లి శ్యామల, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆచంట వీవీ స్వామి పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- సంగమేశ్వర, కైలాసేశ్వర స్వామివార్ల ఆలయ కమిటీల పాలకవర్గాల ప్రమాణం


ఆలయ కమిటీల పాలకవర్గాలతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నాయకులు

మండపేట: దేవాలయ పాలక మండలి సభ్యులుగా భగవంతునికి, భక్తులకు సేవ చేసుకునే భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. ఏడిదకు చెందిన సంగమేశ్వర, కైలాసేశ్వర స్వామివార్ల ఆలయ కమిటీ పాలకవర్గాల ప్రమాణ స్వీకారం శనివారం రథం గుడిలో ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు, ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. శ్రీకైలాసేశ్వర స్వామివారి ఆలయ కమిటీ చైర్మన్‌గా బేతా వెంకటేశ్వరరావు, సభ్యులుగా కొలగారపు ప్రసాద్, కురుపూడి సుబ్బారావు, చిలుకూరి సుజాత, పమిడిపల్లి మౌనిక, వెంటూరి మోహిని సత్యవతి, గాడ లక్ష్మి, అయినవిల్లి సత్యనారాయణ, అలాగే సంగమేశ్వర స్వామివారి ఆలయ కమిటీ చైర్మన్‌గా రామిశెట్టి శ్రీనివాసరావు, సభ్యులుగా చీకట్ల వినయ్‌కుమార్, కుసుమంచి వెంకట సూర్యనారాయణ, కురుపూడి సత్యవేణి, కొండపల్లి సోవమ్మ, ఆచంట లక్ష్మి, పులిదిండి సత్యనారాయణ, అయినవిల్లి నాగభూషణశర్మ ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు రూ. 15 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మించే అదనపు భవనానికి ఎమ్మెల్సీ తోట భూమి పూజ చేశారు. సంగమేశ్వరస్వామివారి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకుల కోసం నూతనంగా నిర్మించిన వసతి భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఏడిద పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఉప సర్పంచ్ చంద్ర శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రామకృష్ణ, కుడిపూడి రాంబాబు, మేడిశెట్టి సూర్యభాస్కరరావు, వాసిరెడ్డి అర్జున్, పమిడిపల్లి నానాజీ, విసపురెడ్డి శివ పాల్గొన్నారు.

సత్తెమ్మను దర్శించుకున్న మంత్రి వేణు


మంత్రి వేణుకు సత్తెమ్మ తల్లి జ్ఞాపిక అందజేస్తున్న సభ్యులు

రామచంద్రపురం: ప్రతి 5 ఏళ్లకోసారి రెల్లి పంచాయతీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పట్టణంలోని సత్తెమ్మ జాతర మహోత్సవాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం రాత్రి పాల్గొన్నారు. మంత్రి వేణు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రెల్లి పంచాయతీ సంఘం సభ్యులు వడ్డాది సత్తిబాబు, ముత్యాల గణపతి, వడ్డాది రాజు, గూడుపు వెంకటగిరి, గొర్రిపర్తి రాజు, బండి సత్యనారాయణలు మంత్రి వేణును దుశ్శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

ఓటర్ల వెరిఫికేషన్‌కు సహకరించాలి

మండపేట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల వెరిఫికేషన్‌కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఓటరు నమోదు అధికారి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎస్.సుధాసాగర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. బూత్‌ల ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. టిడ్కో లబ్ధిదారులకు ప్లాట్లు స్వాధీనం చేసిన నేపథ్యంలో అద్దెకు ఉంటున్న ఖాళీ చేసి ప్లాట్లులోకి వెళ్లిన ఓటర్ల అడ్రస్‌లు మార్పులు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత స్థానిక సీతారామ కమ్యూనిటీ హాలులో సచివాలయ కార్యదర్శులు, బీఎల్‌ఓలకు స్పెషల్ సమ్మరీ రివిజన్, ప్రీ రివిజన్ గురించి అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎలక్షన్ డీటీ మెహర్‌బాబా, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెంకే గంగాధర్, ఉంగరాల రాంబాబు, జొన్నపల్లి సూర్యారావు, మేడపాటి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- టేకి గ్రామంలో గడప గడపకూ..


టేకి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ లబ్ధి అందుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని టేకి గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యులు ఉమ్మిడిశెట్టి వీరవేణి, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కుక్కల బాలయ్య, పీఏసీఎస్ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజులతో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సచివాలయ ఉద్యోగులు వివరించారు. తమకు ఒకటో తేదీన పింఛను డబ్బులు అందుతున్నాయంటూ వృద్ధులు ఎమ్మెల్సీ తోటతో సంతోషాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి జరగడంలేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనలో వాస్తవంలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదిమూలం మార్కెండేయులు, మంగిన బుజ్జియ్య, మాసాబత్తుల వెంకట్రావు, మంగిన వెంకట్రావు, వారా కృష్ణమూర్తిపాల్గొన్నారు.

శ్రమదానంతో గుంతల్లో నీరు తొలగింపు

మండపేట: కెనాల్ రోడ్డు లోని వీరభద్రపురం సమీపంలో ప్రమాదభరితంగా ఉన్న గుంతల్లో వర్షపు నీటిని శ్రమదానంతో తొలగించారు అర్తమూరుకు చెందిన సామాజిక కార్యకర్త చిర్ల శ్రీనివాసరెడ్డి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లు అంచున, గోతుల్లో నీరు నిలిచిపోయి ప్రమాదభరితంగా ఉన్నాయి. 20 చోట్ల పేరుకుపోయిన మట్టిని తొలగించి నీరు బయటకు పోయేలా శ్రీనివాసరెడ్డి శ్రమదానంతో బాటలు చేశారు. గతంలోను శ్రీనివాసరెడ్డి పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేశారు.

సీఐటీయూ అంగన్‌వాడీల నూతన కమిటీ ఎంపిక


రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సీఐటీయూ నూతన కమిటీ

రామచంద్రపురం: ఐసీడీఎస్ రాయవరం ప్రాజెక్టు పరిధిలోని రామచంద్రపురం మండలం, కపిలేశ్వరపురం ప్రాజెక్టు పరిధిలోని కె.గంగవరం మండలాలతో నూతన రామచంద్రపురం ప్రాజెక్టు ఏర్పడిన తరువాత సీఐటీయూ మొదటి మహాసభను పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో శనివారం నిర్వహించారు. మేడిశెట్టి దుర్గ అధ్యక్షతన జరిగిన సభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా వీరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మేడిశెట్టి దుర్గమ్మ, కోశాధికారిగా కె.దుర్గ, సంయుక్త కార్యదర్శిగా వెంకటరత్నం, ఉపాధ్యక్షురాలిగా సూర్యకుమారి, సభ్యులుగా లక్ష్మీరత్నం, శ్రీదేవి, గౌరీదేవి, వీరవేణి, మహాలక్ష్మి, భవాని, సుధ, చంద్రకళ, మాధవి, జహీరా, నాగదేవిలు ఎంపికయ్యారు. వీరిని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ ప్రత్యేకంగా అభినందించారు. నూతన కమిటీ అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికాకూడదు


విద్యార్థులను మోటివేట్ చేస్తున్న సైకాలజిస్టు రామారెడ్డి

కె.గంగవరం: విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎట్టి పరిస్థితిల్లో ఒత్తిడికి గురికాకూడదని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ టి.రామారెడ్డి సూచించారు. మండలంలోని పేకేరులో ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకాలజీ మోటివేషన్ నిర్వహించారు. ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానసిక ప్రశాంతతో విద్యార్థులు ఉండాలని ఒత్తిడికి గురికాకుండా ప్రతి రోజు క్రీడలు ఆడడంతో పాటు యోగాపై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం ఒత్తిడి వల్ల జరిగే అనర్థాలు, నివారణోపాయాలు, లైఫ్ స్కిల్స్ గురించి విద్యార్థులకు సవివరంగా ప్రయోగాత్మకంగా వివరించారు. హెచ్‌ఎం టి.యుగంధర్ రెడ్డి, ఉపాధ్యాయులు గిరిజారాణి, సీఆర్‌పీ పి.రామకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


దాడుల్లో సీజ్ చేసిన టిన్ బీర్లు, బైక్

కె.గంగవరం: మండలంలోని యానం-ద్రాక్షారామ రహదారిలో అక్రమ మద్యం తరలిస్తున్న ఇద్దరు యువకులను ఎస్‌ఈబీ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుంకం చెల్లించని 117 టిన్ బీర్లు స్వాధీనం చేసుకుని మద్యం సీజ్ చేయగా, వాటిని తరలించేందుకు ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేశారు. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి రామచంద్రపురం సబ్‌జైల్‌కు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఈబీ దాడుల్లో పట్టుబడిన ఇద్దరు యువకులు మండలానికి చెందిన సాపిరెడ్డి వెంకట సంతోష్, సాపిరెడ్డి శివకుమార్ అని తెలిపారు.

వలంటీర్లకు వందనం

వేగంగా ప్రభుత్వ పథకాల లబ్ధి


2020 సెప్టెంబర్ 1న 20 నిమిషాల్లోనే రేషన్ కార్డు అందుకుంటున్న చింతా గీతారత్నం (ఫైల్)

ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాలనుకునేవారు అందుకు సంబంధించి కొన్ని నియమాలు పాటించాల్సి ఉండడం సహజం. కానీ ఆ నియమాలు లబ్ధిదారుకు ఆటంకంగానూ, అవస్థలకు పాలు చేసేదిగా ఉండడం సరైంది కాదు. ప్రభుత్వ లబ్ధిని పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా ఆశిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రజలంతా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. మండల కేంద్రంలోని సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు పేదల అవస్థలన్నింటికీ చెక్ పెట్టాయి. పేదవాడు ఉన్నచోటనే ప్రభుత్వ లబ్ధిని పొందేలా ఆయా వ్యవస్థలను స్థానికంగా ఏర్పాటు చేశారు. వలంటీర్లు పేదల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం నుంచి మీకు కావాల్సిన సాయం ఏమిటని అడిగి మరీ సాయం చేస్తున్నారు. టేకి గ్రామానికి చెందిన చింతా గీతారత్నం రేషన్ కార్డు కోసం 2020 సెప్టెంబర్ 23న వలంటీర్ ద్వారా రేషన్ కేర్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న 20 నిమిషాల్లో రేషన్ కార్డును మంజూరు చేసి లబ్ధిదారు చేతికిచ్చారు.

– కపిలేశ్వరపురం

20 నిమిషాల్లోనే బియ్యం కార్డు ఇచ్చారు



2020 సెప్టెంబర్ 23న టేకి- 1 సచివాలయంలో బియ్యం కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాను. డిజిటల్ అసిస్టెంట్ ఫణీంద్ర, వలంటీర్ సురేష్ దరఖాస్తును ఆన్‌లైన్ చేశారు. వీఆర్‌ఓ మల్లేష్ తదితర అధికారులందరూ సచివాలయంలోనే ఉన్నారు. దరఖాస్తు చేసి ఇంటికి కూడా వెళ్ళకుండానే కేవలం 20 నిమిషాల్లోనే బియ్యం కార్డును చేతికి అందించారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు వల్ల నాలాంటి ఎంతో మందికి వేగవంతంగా ప్రయోజనం దక్కుతుంది.

– చింతా గీతారత్నం, టేకి, కపిలేశ్వరపురం మండలం

ఆపదలో కుటుంబ సభ్యుడిగా సేవలు


కోటిపల్లిలో వరద నీటిలో ఆహార పొట్లాలు అందిస్తున్న వలంటీర్ దుర్గాప్రసాద్

మండలంలో కోటిపల్లి మత్స్యకార కాలనీలో వెంకటదుర్గాప్రసాద్ వలంటీర్‌గా గత నాలుగేళ్లుగా సేవలందిస్తున్నాడు. 2020-21 ఆగస్టులో గోదావరి వరద ఉధృతి పెరిగింది. ఆ సమయంలో కోటిపల్లిలో మత్స్యకార కాలనీ మొత్తం నీట మునిగింది. సుమారు 100 కుటుంబాలకు చెందిన ఇళ్లు నీటమునిగాయి. ఆ సమయంలో బయటకు వెళ్లి ఆహారం, నీరు తెచ్చుకోవడానికి కూడా ఇబ్బందిగా ఉండేది. అలాంటి ఆపత్కాలంలోనూ వలంటీర్ ప్రసాద్ పీకల్లోతు వరద నీటిలో ఇంటింటికీ వచ్చి ఆహారం అందించాడు, వలంటీర్ ఉన్నాడనే ధైర్యంతో వారంతా ఆహారం కోసం అలమటించలేదు.

– కె.గంగవరం

ఇంటికే వచ్చి ఆహారం ఇచ్చి..

మాది మత్స్యకార కాలనీ నా పేరు మల్లాడి నాగరాజు. వలంటీర్ దుర్గాప్రసాద్ పీకల్లోతు వరద నీటిలో నుంచి ఇంటికి వచ్చి వరద ఉధృతి ఉన్న వారం రోజులు ఆహారం అందించాడు. దీంతో పాటు తాగు నీరు, మందులు కూడా ఇచ్చాడు. వలంటీర్‌గా ఇంత మనసున్న మనుషులు ఈ రోజుల్లో కూడా ఉన్నారా అనిపించింది.

– మల్లాడి నాగరాజు, కోటిపల్లి

హాస్టల్‌కు వెళ్లి.. పింఛన్ అందించి..


రాజమహేంద్రవరం వెళ్లి మానసిక వికలాంగురాలైన రోజాకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుమ

మండలంలోని అముజూరులో నానాపరపు సుమ వలంటీర్‌గా సేవలందిస్తుంది. ఆమెకు చెందిన 50 కుటుంబాల్లో తాటికొండ రోజా అనే మానసిక వికలాంగురాలు ఉంది. ఆమె తల్లి తాటికొండ సుశీల ఆపరేషన్ నిమిత్తం ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. చూసేవారెవరు ఉండరని భావించి మానసిక వికలాంగురాలైన రోజాను రాజమహేంద్రవరంలోని ఓ హాస్టల్‌లో చేర్పించారు. ప్రతి నెల ఒకటో తారీఖున రోజాకు వలంటీర్ సుమ సొంత ఖర్చులతో పింఛన్ అందించడానికి రాజమహేంద్రవరం వెళ్లి వచ్చేది. ఆపదలో ఉన్న వారికి వలంటీర్‌గా సుమ ఎన్నో సేవలు అందిస్తుందని ఆమె పరిధిలోని లబ్ధిదారులు ఎంతో సంతోషంగా చెబుతున్నారు.

సొంత ఖర్చులతో వచ్చేది..

అనారోగ్యంతో రాజమహేంద్రవరంలో కొంత కాలం చికిత్స పొందాల్సి వచ్చింది. మానసిక వికలాంగురాలైన కూతురు రోజాను చూసుకోవడానికి ఎవరు లేకపోవడంతో కొన్ని నెలలు హాస్టల్‌లో జాయిన్ చేయించాము. హాస్టల్ ఉన్నంత కాలం ప్రతి నెలా మా వలంటీర్ సుమ తన సొంత ఖర్చులతో రాజమహేంద్రవరం వెళ్లి పింఛను సొమ్ము అందించేది. వలంటీర్‌గా సుమ సేవలు చాలా బాగున్నాయి.

– తంటికొండ సుశీల, అముజూరు

సూపర్ ఫైన్ బియ్యం ధరలకు కళ్లెం

- కిలో రూ.46 రేటుకు అమ్మకం
- రైతుబజార్‌లో స్టాల్ ప్రారంభం


రైతుబజార్‌లో సూపర్‌ఫైన్ బియ్యం అమ్మకాలు ప్రారంభిస్తున్న పట్టాభిరామయ్య చౌదరి

మండపేట: చుక్కల్లో చేరిన సూపర్ ఫైన్ రకం బియ్యం ధరలకు కళ్లెం వేసి సామాన్యులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు కిలో రూ.46 కే సూపర్ ఫైన్ బియ్యం అందించేందుకు సివిల్ సప్లయిస్ అధికారులు మండపేటలో రెండు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను శనివారం జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటి మార్కెట్‌లో సూపర్ ఫైన్ బియ్యం ధర కిలో రూ. 65 నుంచి రూ. 70 వరకూ ఉందన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి రూ. 46కు విక్రయించాలని ఇటీవల రైస్‌మిల్లర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ఆదేశించారన్నారు. ఈ మేరకు రైతుబజార్‌లో స్టాల్‌ను ప్రారంభించామని, త్వరలో పట్టణంలో మరో స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు పట్టాభిరామయ్య చౌదరి తెలిపారు. ఆలమూరు తాలుకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి (అబ్బు), ఎంఎస్‌ఓ సుబ్బరాజు, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ బోళ్ల సతీష్, కోళ్ల శ్రీనివాస్, ఎండీయూ వెహికల్ ఆపరేటర్స్ దొరబాబు, కిరణ్‌గౌడ్, స్టాల్ నిర్వాహకుడు వంక మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శత శాతం పథకాలు అందించడం గ్రేట్

రాయవరం: అర్హులైన పేదలందరికీ శత శాతం సంక్షేమ పథకాలు అందించడం చరిత్రాత్మకమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలనే ఇది సాధ్యమవుతుందని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని చెల్లూరు, లొల్ల గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష శిబిరాలను ఆయా పంచాయతీల సర్పంచులు పాలిక రాఘవ, చాట్రాతి జానకి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అర్హులైన వారందరికీ ముఖ్య అతిథులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలంపాలెపు వెంకన్న, ఎంపీటీసీ వైట్ల వీరవేణి, లొల్ల గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ చేవా సత్యనారాయణ, సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ చిక్కాల శ్రీరాములు, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు విజయరేఖ, మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు త్వరగా పూర్తి చేయాలి


కాజులూరులో రైతులకు సూచనలిస్తున్న ఏవో అశోక్

కాజులూరు: మండల గ్రామాల్లోని రైతులు త్వరితగతిన తొలకరి వరినాట్లు పూర్తి చేయాలని మండల ఏవో వి.అశోక్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గోదావరి తూర్పు డెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు గత నెల రోజుల క్రితమే సాగునీరు విడుదల చేశారన్నారు. దానికి తోడు చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నందున ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. రైతులు చొరవచూపి జూలై మూడో వారం నాటికి పూర్తి స్థాయిలో వెదజల్లు లేదా వరినాట్లు పడేలా కృషి చేయాలన్నారు.